ఏర్పాట్లను పరిశీలిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ విద్యులత

నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

ఏర్పాట్లు పూర్తి

కమ్మదనం గురుకుల ప్రిన్సిపాల్ విద్యులత

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 18 : ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నేటి నుంచి 10వ రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ విద్యులత బుధవారం తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-19 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ వంటి వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో 146 సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాల నుంచి 1200 మంది విద్యార్థినులు పాల్గొనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఉర్సు

షాబాద్ పహిల్వాన్‌షావలి దర్గాలో ఉత్సవాలు

ఏర్పాట్లు చేసిన నిర్వహణ కమిటీ

హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల ఏర్పాటు

షాబాద్, డిసెంబర్ 18: జిల్లాలోని షాబాద్ పహిల్వాన్‌షావలి దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని ఉర్సు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం గంధం కార్యక్రమం ఉంటుందని, రాత్రి పది గంటలకు మల్కీబావి సమీపంలో ఉన్న దర్గా నుంచి గంధం భారీగా ఊరేగింపు జరుగుతుందన్నారు. 20న చిరాగాన్(దీపారధన)కవ్వాలీ, 21న మీనాబజార్ ఉంటుందన్నారు. ఉత్సవాలకు షాద్‌నగర్, అష్టల్‌గంజ్, మెహిదీ పట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం తదితర డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు నడిపించనున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

షాపుల్లో తనిఖీ చేస్తున్న సీఐ శివప్రసాద్, పోలీస్ సిబ్బంది

కడ్తాల్, డిసెంబర్ 18: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సీఐ శివప్రసాద్ హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో, బుధవారం రాత్రి మండల కేంద్రంలోని కిరాణా షాపులు, ఫాంహౌసులు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కిరాణా షాపుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా గుట్కా, మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల్లో పది మంది ట్రైనీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం

మద్యం సీసాలను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

షాద్‌నగర్, డిసెంబర్18: అక్రమంగా నిల్వ చేసి, నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న బెల్టు షాపులపై దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల కాలంలో షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేశామని, అక్రమంగా నిల్వచేసిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారుల సూచన మేరకు రూ.3 లక్షల విలువచేసే మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపుల్లో మద్యాన్ని విక్రయిస్తే శాఖా పరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

యాచారం, డిసెంబర్18: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రగాయాల పాలయ్యారు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. దీనికి సంబంధించి సీఐ నరసింహారావు తెలిపిన కథనం ప్రకారం వివరాలు.. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌పై చౌదర్‌పల్లి నుంచి యాచారం వెళ్తున్నాడు. వెనుక నుంచి వస్తున్న ఆటో బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో నాగరాజుతో పాటు తన అత్తమ్మ ఐలమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు, డిసెంబర్ 18: ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, ఓర్సు పద్మలకు మంజూరైన రూ.73 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం బాధితులకు ఆకుతోటపల్లిలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి తరుపున మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట నాయకులు షఫీ, రాములు, సత్యం, బుచ్చయ్య ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్, డిసెంబర్18 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ పోలీస్‌స్టేషన్, సైబర్ వలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే వాటిపట్ల జాగ్రత్త వహించాలన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, తమ ఏటీఎంలు బ్లాక్ అయ్యిందని, ఓటీపీ నంబర్

సైబర్ నేరాలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మాడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చెప్పాలని కాల్స్ చేస్తుంటారని, అలాంటి వాటికి స్పందించకూడదని సూచించారు. లాటరీలో గిఫ్టులు వచ్చాయని, అందుకు కొన్ని డబ్బులు కట్టాలని చెబుతూ ఉంటారని, వాటిని కూడా నమ్మొద్దని సూచించారు. ఏదైనా లింక్‌లు వస్తే వాటిని ఓపెన్ చేయరాదని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, డీఐ రమేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

చేవెళ్ల రూరల్ : విద్యార్థులు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని శంకర్‌పల్లి ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. బుధవారం శంకర్‌పల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలను ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే డయల్ 100, లేదా 1930 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచార మివ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది జ్యోతి, మమత, శ్రీనివాస్, టీఎస్ మాడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్, డిసెంబర్ 18: పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 17న ఇందిరా పార్కు వద్ద పంచాయతీ కార్మికులు తలపెట్టిన ధర్నాకు మొదట అనుమతులిచ్చిన ప్రభుత్వం... ధర్నాకు వెళ్లిన కార్మికులను అక్రమంగా అరెస్ట్‌లు చేసినందుకు నిరసనగా, బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. కార్మికులను క్రమబద్ధీకరణ చేసి, కనీస వేతనాన్ని రూ.18వేలతోపాటు పీఎఫ్‌ను అందించాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడుతామన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు

ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

కుమార్, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, కార్మికులు చెన్నయ్య, అంజమ్మ, జంగమ్మ, వసంత, సుజాత పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్

మౌలిక వసతులు కల్పిస్తాం

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 18: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ అన్నారు. మున్సిపాలిటీలోని 24వ వార్డు పరిధి కుంట్లూరు వెంకటేశ్వరకాలనీలో రూ.37 లక్షల నిధులతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, కౌన్సిలర్ అనుపమరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో మురుగు సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు హరిశంకర్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు విజయ్‌శేకర్‌రెడ్డి, సుప్రసేనారెడ్డి, శ్రీరాములు, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీసులు స్నేహభావంతో మెలగాలి

పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న షాద్‌నగర్ ఏసీపీ సీహెచ్ రంగస్వామి, చిత్రంలో సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు, డిసెంబర్ 18: పోలీసులు ప్రజలతో స్నేహభావంతో ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ సీహెచ్ రంగస్వామి సూచించారు. బుధవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ సీహెచ్ రంగస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందితో వివిధ అంశాలపై మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా శాంతి భద్రతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

షాబాద్ మండలం కుర్వగూడలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

మందులు పంపిణీ చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, వైద్యులు

కడ్తాల్, డిసెంబర్ 18: మండల పరిధిలోని ముద్విన్ అనుబంధ గ్రామమైన చరికొండలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, కామినేని దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాడ్గుల్ పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 330 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్, భావని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వినోద్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేశ్, నాయకులు వెంకట్‌రెడ్డి, సతీశ్, శంకరయ్య, శ్రీశైలం, కృష్ణ, శ్రీను, అనిల్, జంగయ్య, చంద్రయ్య, యాదయ్య, రమేశ్, ప్రకాశ్, బుచ్చిబాబు, ఏఎన్ ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

షాబాద్ మండలం కుర్వగూడలో..

షాబాద్ : మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో చేవెళ్ల పట్టణానికి చెందిన పీఎంఆర్ మెడికల్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కుర్వగూడ మాజీ సర్పంచ్ బుయ్యని సంధ్యమల్లికార్జున్‌గౌడ్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

నేపాల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ త్రిజాధకల్

మొయినాబాద్, డిసెంబర్18: క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నేపాల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ త్రిజాధకల్ అన్నారు. చిలుకూరు రెవెన్యూలో ఉన్న రేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ మనిషిలోని అవయవాల్లో అదనంగా పుట్టుకొస్తుందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించవచ్చన్నారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే నివారించడం సులభమవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ముంబయి లయన్స్ క్లబ్ మెంబర్ ఉదయశ్రీ, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాల్‌లో వ్యక్తి అదృశ్యం

వెంకటరమణ (ఫైల్)

యాచారం, డిసెంబర్18: షాపు నుంచి వెళ్లి పోయిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్ గ్రామంలో బుధవారం జరిగింది. సీఐ నరసింహరావు కథనం ప్రకారం.. మండలంలోని మాల్ గ్రామానికి చెందిన కోపనాతి వెంకటరమణ (45) వెల్డింగ్ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అప్పుల బాధతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మంగళవారం షాపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. అతడి కుమారుడు యాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 18: భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల వేడుకలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను సీపీఐ నాయకులు బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల వేడుకలు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు కృష్ణ, శివ యాదగిరి శ్రీకాంత్, మురళి పాల్గొన్నారు.

సత్తాచాటిన మాడ్గుల హై స్కూల్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాడ్గుల, డిసెంబర్18: ఆమనగల్లు సమితి పరిధిలోని నాలుగు మండలాలకు జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు బుధవారం చూచిరాత పోటీలు నిర్వహించారు. అందులో మాడ్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో కట్ట ఉషశ్రీ, అపూర్వ, అశ్వినిలు ద్వితీయ స్థానంలో నిలిచారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేవారు. కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన్, ఉపాధ్యాయులు దేవయ్య, లక్ష్మి, సాయిశీల, రామకృష్ణ, జాక్విన్ రెడ్డి, అక్సా, జ్యోతి, సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియానికి స్థలాన్ని కేటాయించండి

ఆమనగల్లు, డిసెంబర్ 18: ఆమనగల్లు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కేటాయింటాలని బుధవారం ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వ్యడ్డావత్ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సభ్యులు ప్రసాద్, పవన్‌కల్యాణ్ ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి

విరాళం అందజేత

విరాళం అందజేస్తున్న రాందాస్‌నాయక్

కడ్తాల్, డిసెంబర్ 18: అయ్యప్పస్వామి సన్నిధానం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. మండల పరిధిలోని గడ్డమీది తండాలో నిర్మించనున్న అయ్యప్పస్వామి సన్నిధానం నిర్మాణానికి, బుధవారం మైసిగండి గ్రామానికి చెందిన రాందాస్‌నాయక్ రూ.25వేల చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. దైవ కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాండు, కిషన్, శ్రీను, లచ్చిరాం, మల్లేశ్, వినోద్, కల్యాణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యుడిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబర్ 18: నారాయణపూర్ గ్రామానికి చెందిన బానవత్ క్లేశ్రీ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు తారాసింగ్, శ్రీనూనాయక్, హనుమంతు, లక్ష్మీపతి తదితరులు ఉన్నారు.

గడ్డి వాము దగ్ధం

దగ్ధమవుతున్న వరి గడ్డి

నందిగామ, డిసెంబర్ 18 : మండల పరిధిలోని సలివేంద్రిగూడ గ్రామానికి చెందిన పాశం బుచ్చయ్య తన పశువుల మేత కోసం కేశంపేట మండలంలోని అల్వాల్ గ్రామం నుంచి వరి గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తీసుకుని వెళుతుండగా, రంగాపూర్ గ్రామ శివారులో విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.30 వేల నష్టం జరిగిందని రైతు బుచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

సంతలో దొంగతనాలు అరికట్టాలి

ఎస్సై రాజుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తుర్కయాంజాల్, డిసెంబర్ 18 : మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే వారంతపు సంతలో జేబు దొంగతనాలను అరికట్టాలని కోరుతూ మున్సిపాలిటీ బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు పట్నం రమేశ్ ఆధ్వర్యంలో ఆదిబట్ల ఎస్సై రాజుకు బీఎస్పీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్నం రమేష్ మాట్లాడుతూ తుర్కయాంజాల్ చౌరస్తాలో ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే వారంతపు సంతలో జేబు దొంగలు చేతి వాటం చూపుతున్నారని అన్నారు. పోలీస్ అధికారులు దృష్టి సారించి దొంగతనాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ లను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు ఉన్నారు.

పకడ్బందీగా సర్వే చేపట్టాలి

సర్వే వివరాలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 18 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ అన్నారు. మండల పరిధిలోని ముకునూరు గ్రామంలో బుధవారం చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ 50ఇండ్లు సర్వే చేసి మొబైల్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా సూచించారు. ఈనెల 25నాటికి సర్వే పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు.

శ్మశాన వాటిక భూమిని కాపాడాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ కులస్తులు

శ్మశాన వాటిక భూమిని కాపాడండి

మంచాల, డిసెంబర్ 18: మండల పరిధిలోని అస్మత్‌పూర్ గ్రామంలో ఉన్న దళితుల శ్మశాన వాటిక భూమిని ఆక్రమించేందుకు కొందరు రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లు యత్నిస్తున్నారని, ఆ భూమిని కాపాడాలంటూ బుధవారం గ్రామానికి చెందిన దళితులు మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాద్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నౌసు హరిప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ మాదిగ కులస్తులకు ఎన్నో ఏండ్లుగా రెండు ఎకరాల భూమిని శ్మశాన వాటిక కోసం కేటాయించారని చెప్పారు. ఇటీవల ఆ భూమిని రియల్టర్లు, డాక్యుమెంట్ రైటర్లు కుమ్మక్కై ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్సీ నాయకులు శ్రీను, ప్రవీణ్‌కుమార్, రమేశ్, సుధాకర్, జంగయ్య, జగన్, శేఖర్, చంద్రయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.